
# ఉత్తమ రైతు పురస్కారానికి ఎంపికైన డాక్టర్ శ్రీరాములు

పార్వతీపురం టౌన్: ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విద్యాలయం వార్షిక వి. రామచంద్రరావు ఉత్తమ రైతు పురస్కారానికి 2023 సంవత్సరానికి గాను పార్వతీపురానికి చెందిన డాక్టర్ మంచుపల్లి శ్రీరాములు మాస్టారును ఎంపిక చేసినట్లు వ్యవసాయ విద్యాలయ డైరెక్టర్ ఎల్ ప్రశాంతి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పురస్కారాన్ని జూన్ 12వ తేదీన విద్యాలయ కాన్వొకేషన్ హాలులో అందజేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ పురస్కారానికి ఎంపికైనందున జట్టు ఆశ్రమ డైరెక్టర్ డి.పారినాయుడు మంచుపల్లి శ్రీరాములును అభినందించారు.


డాక్టర్ మంచుపల్లి శ్రీరాములు













































# ఘనంగా అభయాంజనేయ శిలావిగ్రహ ప్రతిష్ఠ


పూజలు చేస్తున్న భక్తులు


శిలావిగ్రహ ప్రతిష్ఠ చేస్తున్న కమిటీ సభ్యులు లక్ష్మణరావు, కిశోర్, శ్రీనివాస్

సీతానగరం: మండల కేంద్రంలో సువర్ణముఖినది ఒడ్డున వేంచేసిన అభయాంజనేయ స్వామి ఆలయ శిఖర శిలా విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు బుధవారం ముగిశాయి. ఈ మేరకు ఆలయ ప్రధాన అర్చకుడు ఎంవీ నాగరాజుశర్మ మాట్లాడుతూ ఆలయ నిర్వాహక కమిటీ పర్యవేక్షణలో శిలావిగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు సోమవారం నుంచి బుధవారం వరకూ పులఖండం విద్యాసాగర్ శర్మ, కర్రి సంతోష్‌కుమార్ శర్మ, డి.మణికంఠశర్మ, ఆర్.సంతోష్ శర్మ, ఎంవీ నిఖిల్ శర్మ అర్చక బృందం నిర్వహించారని తెలిపారు. ఈ ఉత్సవాల్లో చినభోగిలి, పెదభోగిలి, సీతానగరం, అప్పయ్యపేట, బుడ్డిపేట తదితర గ్రామాలకు చెందిన వేలాది మంది భక్తులు పాల్గొన్నారని తెలిపారు. విగ్రహ ప్రతిష్ఠ ఉత్సవాల్లో పాల్గొన్న భక్తులకు నిర్వాహకులు అన్నసంతర్పణ కార్యక్రమం చేపట్టారు. అన్నసంతర్పణలో వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ కమిటీ సభ్యుడు ఆర్.రామకృష్ణ సహాయ సహకారాలు అందజేశారు.

**అంటిపేటలో..**

మండలంలో రాష్ట్ర రహదారిని ఆనుకుని ఉన్న అంటిపేటలో కె దానబాబు దంపతుల ఆధ్వర్యంలో నిర్మించిన ఆంజనేయస్వామి ఆలయం, విగ్రహ ప్రతిష్ఠ ఉత్సవాన్ని ఆగమ వేదపండితుడు ఎం విశ్వనాథస్వామి ఆధ్వర్యంలో నిర్వహించినట్లు కమిటీ సభ్యుడు శంకరరావు తెలియజేశారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ ఆలయాన్ని నిర్మించాలని సంకల్పించిన దానబాబు కుటుంబసభ్యులు ఆలయ నిర్మాణం పూర్తి చేసి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. విగ్రహ ప్రతిష్ఠ అనంతరం పూజా కార్యక్రమంలో పాల్గొన్న భక్తులందరికీ అన్నప్రసాదాలు వితరణ చేశారు.


అంటిపేటలో ఆంజనేయస్వామి ఆలయం

# జిల్లా కేంద్రంలో పొగాకు వ్యతిరేక ర్యాలీ



పొగాకు వినియోగించబోమని ప్రతిజ్ఞ చేస్తున్న వైద్యసిబ్బంది

పార్వతీపురం: ప్రపంచ పొగాకు వ్యతిరేక దినం సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ బి.జగన్నాథరావు బుధవారం జిల్లా ఆస్పత్రి నుంచి అవగాహన ర్యాలీ ప్రారంభించారు. పొగాకు వ్యతిరేక నినాదాలతో ఈ ర్యాలీ ఆర్టీసీ కాంప్లెక్స్ వరకు నిర్వహించారు. అనంతరం డాక్టర్ జగన్నాథరావు మాట్లాడుతూ పొగాకు వల్ల కలిగే నష్టాలను అందరికీ తెలిపేందుకు, అవగాహన కల్పించే లక్ష్యంతో ర్యాలీ నిర్వహించామన్నారు. కార్యక్రమంలో జిల్లా ఆస్పత్రుల సమన్వయ అధికారి డాక్టర్ బి.వాగ్దేవి, డీఐఓ డాక్టర్ టి.జగన్‌మోహనరావు, డీసీఎం భవాని, డెమోలు యోగీశ్వర రెడ్డి, సన్యాసిరావు, వైద్యసిబ్బంది, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

**పొగాకు వినియోగాన్ని నిర్మూలిద్దాం**

సీతానగరం: పొగాకు వినియోగాన్ని నిర్మూలించి కాన్సర్ వ్యాధిని తరిమికొట్టడానికి ప్రజలు సహకరించాలని స్థానిక పీహెచ్‌సీ డాక్టర్ శిరీష పిలుపునిచ్చారు. ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం మండలకేంద్రంలో ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పొగాకుతో వివిధ రకాలుగా తయారైన వస్తువుల వాడకం దారుల్లో ఎక్కువమంది క్యాన్సర్ బారిన పడి ప్రాణాలపైకి తెచ్చుకుంటున్నారన్నారు. ప్రాణాంతకమైన పొగాకు వాడకాన్ని నిర్మూలించడానికి అందరూ సహకరించాలని కోరారు. ఈ మేరకు ప్రజలకు గ్రామాల్లో అవగాహన సదస్సులు ఏర్పాటు చేయాలని వైద్య సిబ్బందికి సూచించారు. పీహెచ్‌సీ నుంచి హనుమాన్ జంక్షన్ మీదుగా మార్కెట్ వరకూ నిర్వహించిన ర్యాలీలో హెల్త్ సూపర్‌వైజర్ ఎంఎల్ హెచ్‌పీలు, ఏఎన్ఎంలు, పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

# మినీ జాబ్ మేళాకు విశేష స్పందన


జాబ్‌మేళాలో పరీక్ష రాస్తున్న యువత

పార్వతీపురంటౌన్: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక శ్రీ వెంకటేశ్వర ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన మినీ జాబ్ మేళాకు విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి సాయి కుమార్ మాట్లాడుతూ డాక్టర్ రెడ్డీస్ ఫార్మా, ఎంఎస్ఎన్ ల్యాబొరేటరీ ప్రతినిధుల ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహించినట్లు తెలిపారు. ఈ జాబ్ మేళాకు 155మంది ఇంటర్వ్యూకు హాజరు కాగా వారిలో నలుగురు ఎంఎస్ఎన్ లాబొరేటరీ కంపెనీలో, 15మంది రెడ్డీస్ ఫార్మాలో ఎంపికయ్యారని తెలిపారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జాబ్ మేళాలు నిర్వహించి నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పిస్తున్నామన్నారు. ఎస్వీడీ కళాశాలలో ఇప్పటివరకు ఆరు జాబ్ మేళాలు నిర్వహించి సుమారు 800మంది వరకు యువతకు ఉద్యోగావకాశాలు కల్పించినట్లు తెలిపారు.

## విత్తన దుకాణాల్లో
# విజిలెన్స్ తనిఖీలు


విత్తన షాపులో తనిఖీలు చేస్తున్న అధికారులు

పాలకొండ: పట్టణంలోని విత్తన షాపుల్లో బుధవారం విజిలెన్స్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. శ్రీకాకుళం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ బి.రామారావు, సిబ్బంది, మండల వ్యవసాయ శాఖ అధికారిణి వై.వాహిణి వీరఘట్టం రోడ్డులో ఉన్న నాగార్జున రైతు సేవా కేంద్రంలో తనిఖీలు చేశారు. ఈ సంవత్సరానికి సంబంధించి విత్తన నిల్వల్లో తేడాలు లేవని గుర్తించారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన ధరకే రైతులకు విత్తనాలు విక్రయించాలని తెలిపారు. నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## వైద్యాధికారులకు
# ధ్రువీకరణ పత్రాల అందజేత



ధ్రువీకరణ పత్రాలను అందజేస్తున్న డీఎంహెచ్ఓ డాక్టర్ బి.జగన్నాథరావు

పార్వతీపురంటౌన్: సురక్షితమైన గర్భస్రావం, గర్భనిరోధక పద్ధతుల (సీఏసీ)పై శిక్షణ పొందిన వైద్యాధికారులకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ బి.జగన్నాథరావు, జిల్లా ఆస్పత్రుల సమన్వయ అధికారి డాక్టర్ బి.వాగ్దేవి బుధవారం జిల్లా ఆస్పత్రిలో ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ డాక్టర్ బి.జగన్నాథరావు మాట్లాడుతూ అవాంఛిత గర్భధారణకు సంబంధించి అర్హులైన, ఆమోదం పొందిన వైద్యుల ద్వారా మాత్రమే గర్భస్రావం జరగాలని, వారు సురక్షితమైన, నిబంధనలతో కూడిన పద్ధతులు అనుసరిస్తారన్నారు. తద్వారా ఆరోగ్య రీత్యా ఎటువంటి అనర్థాలు జరగకుండా నివారించగలుగుతారన్నారు. జిల్లాలోని మారుమూల గ్రామాల్లో ప్రజలకు మరింతగా అవగాహన పెంపొందించేందుకు ఈ శిక్షణ కార్యక్రమం దోహదపడుతుందన్నారు. జిల్లాలోని అన్ని పీహెచ్‌సీల వైద్యాధికారులకు బ్యాచ్‌ల వారీగా శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. అర్హత, నైపుణ్యం లేని వారు గర్భస్రావం, గర్భనిరోధక పద్ధతులు అవలంబిస్తే తగు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.
























# శానిటరీ ఇన్‌స్పెక్టర్ మృతికి సంతాపం

సాలూరు: అనారోగ్యంతో ఇటీవల మరణించిన శానిటరీ ఇన్‌స్పెక్టర్ మురళి మృతికి మున్సిపల్ సభ్యులు నివాళులు అర్పించి సంతాపం తెలిపారు. ఈ మేరకు బుధవారం మున్సిపల్ ఛైర్‌పర్సన్ పువ్వల ఈశ్వరమ్మ అధ్యక్షతన కమిషనర్ శంకరరావు ఆధ్వర్యంలో మున్సిపల్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో తొలుత నివాళులర్పించిన అనంతరం వార్డుల్లో అభివృద్ధి పనులపై చర్చించి సభ్యులు ఆరు అంశాలను ఆమోదించారు. జీరో అవర్‌లో సభ్యులు మాట్లాడుతూ, మున్సిపాలిటీలో ఆస్తుల అమ్మకాలు చేసేటప్పుడు డాక్యుమెంట్ లేదా మార్కెట్ విలువ మీద ఒకశాతం అమలు చేస్తున్న పన్నును అరశాతానికి తగ్గించి వసూలు చేయాలని పలువురు కౌన్సిలర్‌లు గిరిరఘు, రాపాక మాధవరావు,గొర్లె వెంకటరమణ, బలభద్ర శ్రీనువాసరావు తదితరులు డిమాండ్ చేశారు. దీనిపై కమిషనర్ మాట్లాడుతూ, మున్సిపాలిటీలో ఆర్థికపరమైన ఇబ్బందులు రాకుండా ఒక శాతం పన్ను విధింపు కొనసాగుతుందని పేర్కొన్నారు. వెంటనే కౌన్సిలర్‌లు స్పందిస్తూ బొబ్బిలి, పార్వతీపురం మున్సిపాలిటీల్లో అరశాతం పన్నులు వసూలు చేస్తున్నారని గుర్తుచేశారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఒకశాతం పన్ను వసూలు చేస్తున్నామని ,మున్సిపాలిటీ అభివృద్ధికి సభ్యులు సహకరించాలని ఛైర్‌పర్సన్ కోరారు. సమావేశంలో మున్సిపల్ వైస్‌ఛైర్‌పర్సన్ జర్జాపు దీప్తి, వైస్‌ఛైర్మన్ వంగపండు అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.



శానిటరీ ఇన్‌స్పెక్టర్ మృతి పట్ల సంతాపం తెలుపుతున్న సభ్యులు



















## విద్యుత్ సరఫరా పునరుద్ధరణ




సాక్షిలో ప్రచురితమైన కథనం

సాక్షి ఎఫెక్ట్...

సాలూరు: మండలంలోని కొత్తవలస పంచాయతీ బుట్టిగానివలసలో విద్యుత్ లేక ప్రజలు పడుతున్న ఇబ్బందులపై సాక్షిలో బుధవారం ప్రచురితమైన కథనంపై ఆ శాఖ అధికారులు స్పందించారు.నూతన విద్యుత్ స్తంభాలు వేసి విద్యుత్ సరఫరా పునరుద్ధరించారు.ఇదే విషయాన్ని బుధవారం ఎలక్ట్రికల్ ఈఈ హరి ఓ ప్రకటనలో స్పష్టం చేశారు. పట్టణంలోనూ విద్యుత్ మరమ్మతులు చేసినట్లు తెలిపారు.

## చీకట్లో శిఖపరువు



తెగిన విద్యుత్ వైర్లను చూపిస్తున్న గ్రామస్తులు

సాలూరు: మండలంలోని శిఖపరువు గ్రామంలో మూడు రోజుల నుంచి విద్యుత్ సరఫరా లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి వేళ సమీప అడవుల నుంచి వన్య ప్రాణులు వస్తాయేమోనని బిక్కుబిక్కుమంటూ కాలం గడుపుతున్నామని గ్రామస్తులు వాపోతున్నారు. ఎలక్ట్రికల్ అధికారులు స్పందించి గ్రామంలో విద్యుత్ సరఫరా పునరుద్ధరించాలని కోరుతున్నారు. దీనిపై ఏఈ సింహాచలాన్ని వివరణ కోరగా, తమకు ఇంతవరకు సమాచారం అందలేదని, వెంటనే గ్రామంలో విద్యుత్ సరఫరా పునరుద్ధరణ పనులు చేపడతామని తెలిపారు.

## నలుగురు పోలీసులకు బదిలీ

సీతానగరం: స్థానిక పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తున్న నలుగు సిబ్బందికి ఇటీవల పార్వతీపురం మన్యంజిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆధ్వర్యంలో బదిలీ జరగ్గా వారి స్థానంలో కొత్తగా నలుగురు రానున్నారని ఇన్‌చార్జ్ ఎస్సై ప్రశాంత్‌కుమార్ తెలియజేశారు. ఈ మేరకు బుధవారం ఆయన మాట్లాడుతూ స్థానికంగా ఏఎస్సై ఆరిక మోహన్‌రావుకు నీలకంఠాపురం, మహిళా కానిస్టేబుల్ పి.లావణ్య పార్వతీపురం మహిళా పోలీస్‌స్టేషన్‌కు, హెచ్‌సీ కృష్ణమోహన్, మహిళా కానిస్టేబుల్ ఫాతిమాకు సాలూరు రూరల్ పోలీస్‌స్టేషన్‌కు బదిలీ అయిందని చెప్పారు. వారి స్థానంలో బలిజిపేట పీఎస్ నుంచి హెచ్‌సీలు సుజాత, అప్పారావు, పార్వతీపురం ట్రాఫిక్ ఏఎస్సై కుమారస్వామి, కానిస్టేబుల్ సంపత్ కుమార్ రానున్నారని చెప్పారు.







